సాక్షి
వరంగల్
ఆదివారం | 1 | జనవరి | 2023

నూతన ఉత్తేజంతో..



నయా జోష్

కొత్త ఆలోచనలు. కొంగొత్త ఆశయాలు. నిన్నటి అనుభవాలు. రేపటికి గుణపాఠాలు. వీటన్నింటినీ బేరీజు వేసుకుంటూ గత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ.. నూతన సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు గ్రేటర్ వరంగల్ వాసులు. ఈ ఏడాది అందరి ఆశయాలు నెరవేరాలని కోరుకుంటూ..

● 2023 సంవత్సరానికి స్వాగతం

కొత్త ఆలోచనలు.. నూతన విధానాలతో 2023లో అభివృద్ధి వైపు పయనిస్తామని కలెక్టర్ గోపి చెబుతుండగా.. నేరాల నియంత్రణే లక్ష్యంగా ముందుకెళ్తామని వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్ తెలిపారు. ఎన్నో జ్ఞాపకాలతో ముగిసిన 2022 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ.. నూతన ఏడాది 2023కు స్వాగతం పలుకుతున్నారు. ఈనేపథ్యంలో శనివారం 'సాక్షి'తో కలెక్టర్ గోపి, సీపీ రంగనాథ్ పలు విషయాలపై మాట్లాడారు.

– సాక్షి, వరంగల్

జిల్లా అభివృద్ధికి కృషి



కలెక్టర్ గోపి

జిల్లాను ప్రగతి బాటలో ఉంచేందుకు కృషి చేస్తామని కలెక్టర్ గోపి అన్నారు. నూతన ఆంగ్ల సంవత్సరం ప్రారంభం సందర్భంగా ఆయన శనివారం సాక్షితో మాట్లాడారు. జిల్లాలో పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి పనులు మరింత సమర్థంగా అమలుచేసి ఆయా గ్రామాలు, పట్టణాలు రూపురేఖలు మారుస్తామని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా కోవిడ్ మహమ్మారి మళ్లీ విజృంభించే అవకాశం ఉందన్న ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటుమన్నారు. అర్హులు బూస్టర్ డోస్ వేసుకునేలా అవగాహన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. వరంగల్ బస్టాండ్‌ను ఆధునిక హంగులు, సౌకర్యాలతో రూ.74.50 కోట్లతో ఈ ఏడాది త్వరగా పూర్తయ్యేలా చొరవ తీసుకుంటానని తెలిపారు. శ్మశానవాటికల నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం వేగిరం చేస్తామన్నారు. చెత్తను కంపోస్ట్‌గా మార్చి రైతులకు విక్రయించేలా చర్యలు చేపడతామని తెలిపారు. పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధి చేస్తామన్నారు. అన్ని మున్సిపల్ కేంద్రాల్లో రహదారుల అభివృద్ధి, డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపరుస్తామని స్పష్టం చేశారు. పర్వతగిరి, రాయపర్తి మండల కేంద్రాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద బిగించిన ఎల్ఈడీ లైట్లను ఈ ఏడాది జిల్లాలోని 323 గ్రామాల్లో 38వేల బల్బులను అమర్చనున్నట్లు వెల్లడించారు. రైతులు సాగుపై సంబంధిత అధికారులతో అవగాహన సదస్సులు నిర్వహిస్తాం. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందేలా పనిచేస్తాం.

భూకబ్జాలపై ఉక్కుపాదం



పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో హద్దులు మీరుతున్న భూకబ్జాలపై కఠినంగా వ్యవహరించనున్నట్లు పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ తెలిపారు. స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసిడ్యూర్స్ (ఎస్ఓపీ) నిబంధనల ప్రకారం ఏ భూసమస్యపై ఎలా ముందుకెళ్లాలన్న దానిపై జనవరిలో నల్సార్ విశ్వవిద్యాలయ న్యాయ నిపుణులు, ఉద్యోగ విరమణ పొందిన రెవెన్యూ ఉన్నతాధికారులతో సిబ్బందికి శిక్షణ నిర్వహించనున్నట్లు ఆయన శనివారం 'సాక్షి'కి తెలిపారు. మహిళా భద్రతపై సిబ్బందికి వర్క్‌షాప్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కొత్త ఏడాదిలో ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పరంగా పకడ్బందీ చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. భూ, వివిధ సమస్యల పరిష్కారం, భవిష్యత్ ప్రణాళిక సీపీ మాటల్లోనే.. హైదరాబాద్‌లో అమలవుతున్న ఆపరేషన్ రోప్‌వే కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తాం. ఇందుకోసం ఈనెలలోనే బల్దియా అధికారులతో మరోసారి సమావేశమవుతాం. వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రధాన రహదారుల్లోని జంక్షన్ల వద్ద స్టాప్ లైన్, జీబ్రా క్రాసింగ్ పెయింటింగ్ వేసేలా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించాం. అలాగే రోడ్లను ఆక్రమించి వ్యాపారం చేస్తున్న వారి దుకాణాలు తొలగిస్తాం. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరిస్తాం. సీసీ టీవీ కెమెరాల సంఖ్య పెంచుతాం. అసాంఘిక మూకలపై కఠినంగా వ్యవహరిస్తాం. అసెంబ్లీ ఎన్నికలకు సిబ్బందిని సమాయత్తం చేస్తాం. సైబర్‌క్రైమ్ విషయంలో జనాలకు అవగాహన కలిగించేలా ప్రతీ ఠాణాలో వాల్‌పోస్టర్లు అంటిస్తాం. అలాగే కళాజాత బృందాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తాం. ఈకేసు విషయాల్లో సిబ్బంది ఎలా వ్యవహరించాలనే దానిపై కూడా తర్ఫీదునిస్తాం.

విద్యార్థులు చదువులో ముందుండాలి



మ్యాగజైన్ ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్, తదితరులు

పర్వతగిరి: విద్యార్థులు చదువులో ముందుండాలని అదనపు కలెక్టర్ శ్రీవత్స అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో శనివారం వార్షికోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు. విద్యార్థినులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీవత్స మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే సదుపాయాలను వినియోగించుకుని ఉన్నత లక్ష్యంతో చదవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కోమి, సోషల్ వెల్ఫేర్ హెడ్ ఆఫీస్ శర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంఘటితంగా పోరాడాలి

నర్సంపేట: దివ్యాంగుల న్యాయమైన హక్కుల సాధనకు కలిసికట్టుగా పోరాడాలని దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నూకల కృష్ణమూర్తి, జిల్లా మహిళా అధ్యక్షురాలు పుప్పాల రజిత పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శనివారం ధనికల రాములు అధ్యక్షతన నిర్వహించిన దివ్యాంగుల సంక్షేమ సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. దివ్యాంగుల సంక్షేమ సంఘం బలోపేతం కోసం గ్రామ, మండల కమిటీలను వేయడం జరుగుతుందని తెలిపారు. ప్రపంచ మానవ హక్కుల సంఘం బాధ్యుడు, డివిజన్ చైర్మన్ యాదగిరిస్వామి, కార్యదర్శి దాస రాజేష్‌లు దివ్యాంగుల సంక్షేమ సంఘానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. రాజుయాదవ్, కూనగంటి ప్రభాకర్, జనగాం లక్ష్మయ్య, రుద్రారపు రజిత, కుమ్మరి సంపత్, దండు వెంకన్న, మంద మధు పాల్గొన్నారు.



అ'పూర్వ' సమ్మేళనం

- 1971-72 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం
- నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్న వృద్ధులు


మాట్లాడుతున్న పూర్వ గురువు


తమ తరగతిలో కూర్చున్న పూర్వ విద్యార్థులు

దుగ్గొండి: వారంతా డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, టీచర్లుగా, ప్రొఫెసర్లుగా పనిచేస్తున్నారు. కొందరు రిటైర్ కూడా అయ్యారు. వీరంతా ఒక్కరోజు మళ్లీ విద్యార్థులయ్యారు. కురువృద్ధులైన గురువులతో మరొక్కసారి పాఠాలు చెప్పించుకుని మురిసిపోయారు. ఈ అపురూప కార్యక్రమానికి వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం నాచినపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికైంది. ఈ పాఠశాలలో 1971–72 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన 16 మంది విద్యార్థులు శనివారం పాఠశాల ఆవరణలో 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గోల్డెన్ జూబ్లీ వేడుకలు జరుపుకున్నారు. 65నుంచి 70 ఏళ్ల మధ్యలో ఉన్నవారు చిన్ననాటి పాఠశాలకు చేరుకుని నాటి తరగతి గదులను చూసి మురిసిపోయారు. విద్యార్థులుగా మారి గదిలో కూర్చుని నాటి కురువృద్ధులైన గురువులతో పాఠాలు చెప్పించుకున్నారు. గురువులను శాలువాలు, పూలమాలలో సన్మానించారు. పాఠశాల అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేశామని, నేడు కళతప్పిన ప్రభుత్వ బడిని మళ్లీ పూర్వ వైభవం తీసుకురావడానికి తాము పాటుపడతామన్నారు. కార్యక్రమంలో గురువులు మురళీధరస్వామి, శ్రీరాంమూర్తి, నర్సింహారెడ్డి, పూర్వ విద్యార్థులు ప్రముఖ స్త్రీల వైద్య నిపుణుడు అంద్య నర్సింహారెడ్డి, పిల్లల వైద్య నిపుణులు కూనమల్ల రామస్వామి, రామచంద్రయ్య, డిగ్రీ కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి, రామచంద్రయ్య, సమ్మయ్య, పుచ్చకాయల బుచ్చిరెడ్డి, సారంగపాణి, సదానందం, చెప్యాల బాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, గన్న మోహన్‌రెడ్డి, మల్లారెడ్డి, చంద్రసేనాచారి, స్థానిక హెచ్‌ఎం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.







కల్లాల వద్దే మిర్చి కొనుగోళ్లు

- ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్ది

నర్సంపేట: ప్రభుత్వ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రతిష్టాత్మకంగా తేజ మిర్చి కొనుగోలును ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తుందని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కొనుగోళ్ల ఏర్పాటుకు కృషి చేయడం జరుగుతుందని, రైతులకు మార్కెట్‌కు తరలించే అదనపు శ్రమ, ఖర్చులను తగ్గించడమే ప్రభుత్వ ఉద్దేశం అన్నారు. రైతు ముంగిట మార్కెట్ ధర చెల్లింపు, ఈ సంవత్సరం తేజ రకము మాత్రమే కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. నియోజకవర్గ పరిధిలోని చెన్నారావుపేట, దుగ్గొండి, నల్లబెల్లి, నెక్కొండ మండలాల్లోని తేజ మిర్చి సాగు చేస్తున్న రైతులకు నేరుగా వారి కల్లాల వద్దనే క్వాలిటీ పారామీటర్స్ ప్రకారం గ్రేడింగ్ ఆధారంగా కొనుగోలు చేయడం జరుగుందన్నారు. వరంగల్ గ్రేన్ మార్కెట్‌లోని ఐదు రోజుల ముందు ధరను ప్రామాణికంగా తీసుకుని సరాసరి ధరను లెక్కించి ధర నిర్ణయించనున్నట్లు పేర్కొన్నారు. ఆయా మండలాల్లో జిల్లా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సిబ్బంది జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లు, క్షేత్రస్థాయి సిబ్బంది తేజ మిర్చిని పండించిన రైతుల వివరాలను సేకరించనట్లు చెప్పారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు సెంటర్ల మాదిరిగానే ఈ కొనుగోలు నిర్వహణ పూర్తి ప్రభుత్వ ఆజమాయిషీతో నిర్వహించనున్నారు. రైతుల ఖాతాలో డబ్బులు వారం రోజుల్లో జమ అవుతుతాయని తెలిపారు. అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లు ముక్కెర ఈశ్వర్, మహేందర్, సుధాకర్, శ్రీనివాస్, రాజు, సునీత పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నర్సంపేట : రాష్ట్రంలోని వివిధ గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చంద్రన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపీడీఓ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ స్వామికి శనివారం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చంద్రన్న మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ గ్రామాలలో రెండు, మూడు సంవత్సరాల నుంచి జరుగుతున్న అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, స్థానిక చిన్న, చితక కాంట్రాక్టర్లను అనేక ఆర్థికపరమైన అవస్థలు పడుతున్నారన్నారు. దీంతో వడ్డీలకు అప్పులు తెచ్చి కాంట్రాక్టు పనులు చేసిన బిల్లులు రాక తెచ్చిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను రాష్ట్రంలోని కేసీఆర్ ప్రభుత్వం పక్కదారి పట్టించడం వల్ల పనులు చేసిన వారు ఆర్థికంగా చితికిపోతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 194జీఓను అమలు చేయకుండా కేసీఆర్ ప్రభుత్వం 1600జీఓను తీసుకొచ్చి గ్రామాల్లో చేసిన పనులకు బిల్లులు రాకుండా కుట్ర పూరితంగా అడ్డుకుంటున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐపీకేఎస్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి, అధ్యక్షుడు మాడ అశోక్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రాజు, అడ్డూరి రాజు, కందిక రమేష్, నరసింహారావు, అలువాల నరేష్, శంకర్, నారాయణ పాల్గొన్నారు.

ఆరోగ్య సూచీ లక్ష్యాలను చేరుకోవాలి


కార్యక్రమంలో పాల్గొన్న డీఎంహెచ్ఓ, సిబ్బంది

గీసుకొండ: వైద్యులు, సిబ్బంది, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు నిబద్ధతతో పని చేసి ఆరోగ్య సూచీ లక్ష్యాలను చేరుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై శనివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. విధులపై నిర్లక్ష్యంగా ఉండే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. ప్రతీ ఒక్కరూ సమయపాలన పాటించాలన్నారు. ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ గోపాల్‌రావు, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ చల్లా మధుసూదన్ పాల్గొన్నారు. అనంతరం నూతన సంవత్సరానికి స్వాగతం పులుకుతూ కేక్ కట్ చేశారు.

మొక్కలను పెంచితే బహుమతి!


మహిళలకు మొక్కలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

గీసుకొండ: మండలంలోని జాతీయ ఉత్తమ గ్రామపంచాయతీ మరియపురం సర్పంచ్ అల్లం బాలిరెడ్డి తన గ్రామ మహిళలకు వెరైటీగా ఉండే న్యూఇయర్ గిఫ్ట్‌ను ఆఫర్ చేశారు. గ్రామం ఇప్పటికే పచ్చదనం పరుచుకోగా.. ప్రతీ ఇంటి ఆవరణలో కిచెన్ గార్డెన్ పెంపకాన్ని ప్రోత్సహించాలని సర్పంచ్ భావించారు. మేలు రకమైన విత్తనాలతో పలు రకాల కూరగాయల మొక్కల నారును పెంచి వాటిని శనివారం గ్రామంలోని మహిళలకు పంపిణీ చేశారు. మొక్కలను శ్రద్ధతో పెంచి కూరగాయలు కాసేలా కిచెన్ గార్డెన్‌ను అభివృద్ధి చేసిన వారిని ఎంపిక చేసి ప్రథమ బహుమతిగా రూ.3 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.2 వేలు, తృతీయ బహుమతిగా రూ.వెయ్యి అందిస్తామని సర్పంచ్ ప్రకటించారు. దీంతో మహిళలు కూరగాయల మొక్కల కోసం క్యూకట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వప్న పాల్గొన్నారు.

బస్సు, బైక్ 'ఢీ'.. మహిళకు తీవ్ర గాయాలు



నెక్కొండ : మండలంలోని పెద్దకొర్పోలులో శనివారం ఎదురెదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ కొన్న ఘటనలో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రేకులతండాకు చెందిన బాదావత్ భాస్కర్ తన ద్విచక్ర వాహనంపై తల్లి విజయను తీసుకొని కేసముద్రం మండలంలోని ఇంటికన్నె రైల్వే స్టేషన్‌కు వెళ్తున్నారు. కాగా మహబూబాబాద్ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు పెద్ద కొర్పోలు మీదుగా నెక్కొండ వయా వరంగల్‌కు వెళ్తోంది. ఈ క్రమంలో గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న బస్సును తప్పించే క్రమంలో అదుపు తప్పి, బస్సును ఢీ కొట్టాడు. ఈ క్రమంలో విజయ కుడి కాలు బస్సు టైర్ల కింద పడడంతో పాదం నుజ్జునుజ్జు అయ్యింది. విజయను 108 వాహనంతో ఎంజీఎంకు తరలించి, మెరుగైన చికిత్స కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.





డీజీపీని కలిసిన సీపీ ఏవీ.రంగనాథ్


డీజీపీ అంజనీకుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీపీ

వరంగల్ క్రైం: తెలంగాణ డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన అంజనీకుమార్‌ను హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో శనివారం వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్ మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణపై వరంగల్ కమిషనరేట్‌లో పోలీసులు తీసుకుంటున్న చర్యలను నూతన డీజీపీ సీపీ రంగనాథ్‌ను అడిగి తెలుసుకున్నారు.

విద్యుదాఘాతంతో ట్రాక్టర్ డ్రైవర్ మృతి

వరంగల్ రూరల్: వరంగల్ మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ఎద్దు రవీందర్ (38)శనివారం విద్యుదాఘాతంతో మృతి చెందాడని ఏనుమాముల పోలీస్‌స్టేషన్ సీఐ చేరాలు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మాణంలో భాగంగా రవీందర్ ఇంటి దర్వాజ ఎత్తే కార్యక్రమం ఆదివారం నిర్వహించనున్నారు. ఈనేపథ్యంలో నీటి కోసం మంకాళ రవికి చెందిన ట్రాక్టర్‌లో బుద్ధ రాంచందర్ బావి వద్దకు రవీందర్ వెళ్లాడు. ఈక్రమంలో కిందకు వేలాడుతూ ఉన్న విద్యుత్ తీగలు తాకడంతో రవీందర్ అక్కడికక్కడే మృతి చెందాడు. రవీందర్ స్వస్థలం జిల్లాలోని దుగ్గొండి మండలం లంకేపల్లి కాగా.. పది సంవత్సరాల నుంచి ములుగు రోడ్‌లోని వి.కె.గార్డెన్ సమీపంలో భార్య, ఇద్దరు పిల్లలతో అద్దెకు ఉంటున్నారు. ఇటీవల సొంత ఇళ్లు నిర్మించుకోవడానికి పనులు ప్రారంభించారు. ఈక్రమంలో రవీందర్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

